సంపుటి :02 సంచిక :297 పేజీలు :05 వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

బుధవారం 04, ఫిబ్రవరి 2026



## ఏసీబీ వలలో 'పెద్ద' చేప

- రూ. 15 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిపోయిన ఎస్ఈ
- బిల్లుల క్లియరెన్స్ కోసం కాంట్రాక్టర్‌ను వేధించిన వైనం..
- జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ ఆఫీసులో ఏసీబీ మెరుపు దాడులు

05



04

## రేపటి నుంచే మేడారం 'మొక్కుల' లెక్కింపు

- హనుమకొండ టీటీడీ కళ్యాణ మండపంలో భారీ ఏర్పాట్లు



# ఆల్ టైం రికార్డ్

- వండర్ హాట్ మిర్చి ధర క్వింటాల్ రూ. 37,100
- వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో సరికొత్త రికార్డు ధర..
- 'దేశీ' రకానికి ఏకంగా రూ. 41 వేలు

05



## సీఎం పర్యటనకు 'కోటంచ' ముస్తాబు

- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్
- 8న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనానికి రానున్న రేవంత్

05

## ఇసుక క్వారీల్లో కాసుల వేట

కాంట్రాక్టర్ల అక్రమ వసూళ్లపై గగ్గోలు!


02

- ప్రభుత్వ నిబంధనలకు పాతర..
- లారీకి రూ.3,500 వరకు అదనపు వసూళ్లు
- టీఎస్ఎండీసీ అధికారులు ఉన్నా.. క్వారీల్లో సాగుతున్న దోపిడీ

## మున్సిపల్ పోరు..

# ప్రచార జోరు!

### హోరెత్తుతున్న వార్డులు.. గడపగడపకూ అభ్యర్థులు




02

క్లీన్ స్వీప్‌పై ఎమ్మెల్యేల గురి..

రంగంలోకి అగ్రనేతలు

ఈ నెల 8న భూపాలపల్లికి సీఎం రేవంత్ రాక

మున్సిపల్ కురుక్షేత్రం మొదలైంది. నామినేషన్ల ఘట్టం ముగియడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పొలిటికల్ హీట్ పీక్స్‌కు చేరింది. గల్లీ గల్లీలో పార్టీ జెండాలు రెపరెపలాడుతుండగా, మైకుల హోరుతో వార్డులు దద్దరిల్లుతున్నాయి. గడపగడపకూ తిరుగుతున్న అభ్యర్థులు ఓటర్ల కాళ్లు పట్టుకుంటున్నారు. మున్సిపల్ పీఠం దక్కించుకోవడమే లక్ష్యంగా అగ్రనేతలు రంగంలోకి దిగుతుండగా, క్లీన్ స్వీప్ చేయడమే ధ్యేయంగా ఎమ్మెల్యేలు వ్యూహాలకు పదును పెడుతున్నారు. బుధవారం నుంచి క్షేత్రస్థాయిలో అసలైన యుద్ధం మొదలైంది. – అక్షరదర్బార్, వరంగల్




భూపాలపల్లి ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర



పరకాలలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

# ప్రచార హోరు

- ఓటర్లను కలిసేందుకు గడపగడపకు అభ్యర్థులు
- క్షేత్రస్థాయిలో పార్టీల ముఖ్య నేతల కార్నర్ మీటింగ్స్
- తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇంఛార్జీలు
- రంగంలోకి దిగిన ప్రధాన రాజకీయ పార్టీల అగ్రనేతలు
- 8న భూపాలపల్లికి సీఎం రేవంత్ రాక
- ప్రతి మున్సిపాలిటీలోనూ పొలిటికల్ హీట్

అక్షరదర్బార్, వరంగల్ : మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో అభ్యర్థుల ఖరారు ప్రక్రియ పూర్తయ్యింది. బుధవారం నుంచి వార్డులు, డివిజన్లలో మైకుల హోరు, పార్టీ జెండాల సందడి మొదలైంది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు తమ ప్రచారానికి పదును పెడుతూ, ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జనవరి 27న నోటిఫికేషన్ విడుదల చేయగా, నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 మున్సిపాలిటీల్లో గల మొత్తం 260 వార్డులకు గాను 1072 మంది అభ్యర్థులు తుది బరిలో నిలిచారు. రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులకు 'బీ–ఫామ్'లు అందజేయడంతో పాటు, స్వతంత్రులకు కూడా గుర్తులు కేటాయించడంతో ఎన్నికల చిత్రంపై పూర్తి స్పష్టత వచ్చింది.

## - అగ్రనేతల ప్రచార హోరు..

తమ పార్టీ అభ్యర్థుల గెలుపు గుర్రాలు ఎక్కించేందుకు రాష్ట్ర స్థాయి నేతలు సైతం ప్రచార బాట పట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం నల్గొండ జిల్లా నుంచి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ నెల 8వ తేదీన ఆయన భూపాలపల్లి జిల్లాలో పర్యటించి, కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ప్రచారం చేయనున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ శ్రేణులు, అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నితిన్ నబిన్ తొలిసారి రాష్ట్రానికి వచ్చి మహబూబ్ నగర్ వేదికగా శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. బీఆర్ఎస్ తరపున బుధవారం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరకాలలో విస్తృత ప్రచారం నిర్వహించగా, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ వర్ధన్నపేటలో అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేపట్టి వ్యూహాలు రచిస్తున్నారు. ఇక్కడ బీఆర్ఎస్ మున్సిపల్ ఎన్నికల ఇంఛార్జి నాగుర్ల వెంకటేశ్వరరావు కూడా తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తున్నారు.

## - క్లీనర్స్ స్వీప్ పై గురి

స్థానిక ఎమ్మెల్యేలు తమ తమ మున్సిపాలిటీలను క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా రంగంలోకి దిగారు. పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డి, భూపాలపల్లిలో గండ్ర సత్యనారాయణరావు, వర్ధన్నపేటలో కేఆర్ నాగరాజు, నర్సంపేటలో దొంతి మాధవరెడ్డి స్వయంగా కార్నర్ మీటింగ్లలో పాల్గొంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, అభివృద్ధికి పట్టం కట్టాలని కోరుతున్నారు. ఏఐసీసీ కార్యదర్శి, బుధవారం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తో కలిసి పరకాలలో, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తో కలిసి వర్ధన్నపేటలో జరిగిన కార్నర్ మీటింగ్ లలో పాల్గొన్నారు. మరో వారం రోజులే సమయం ఉండటంతో అభ్యర్థులు రాత్రింబవళ్లు ప్రచారంలో మునిగిపోయారు. గెలుపు ఎవరిని వరిస్తుందో తెలియాలంటే ఫిబ్రవరి 13 వరకు వేచి చూడాల్సిందే. ఈనెల 11న పోలింగ్ జరగనుంది.



వర్ధన్న పేట మున్సిపాలిటీలో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు



పరకాల మున్సిపాలిటీలో ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి

# పరకాల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేద్దాం

## మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రేవూరి

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మూడో వార్డు అభ్యర్థి పోరండ్ల మౌనిక వేణు, నాలుగో వార్డు అభ్యర్థి ఏకు దివ్య విద్యాసాగర్, 16వ వార్డు అభ్యర్థి బండి శ్రీధర్ గెలుపునకై టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతితో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్యం వల్ల పరకాల పట్ట ణం అభివృద్ధికి దూరమైందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, నూత న రేషన్ కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసు కెళ్లి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

# ఇసుక క్వారీల్లో 'కాసుల' వేట

- కాంట్రాక్టర్ల అక్రమ వసూళ్లపై గగ్గోలు!
- ప్రభుత్వ నిబంధనలకు పాతర..
- లారీకి రూ.3,500 వరకు అదనపు వసూళ్లు
- టీఎస్ఎండీసీ అధికారులు ఉన్నా.. సాగుతున్న దోపిడీ

అక్షరదర్బార్, హనుమకొండ : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఇసుక క్వారీలు అక్రమ వసూళ్లకు అడ్డాగా మారుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక లోడింగ్ ఉచితంగా జరగాల్సి ఉన్నా, క్షేత్రస్థాయిలో కాంట్రాక్టర్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. లారీ యజమానుల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతూ అందినకాడికి దండుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపించడంతో క్వారీ నిర్వాహకుల ఆగడాలకు అడ్డుఅదుపు లేకుండా పోతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## - అన్నీ 'ఖర్చులే'.. అన్నీ 'వసూళ్లే'!

మహాదేవపూర్ మండలంలోని నాలుగు ప్రధాన క్వారీల్లో గోదావరి ఇసుక నిల్వలను టీఎస్ఎండీసీ పర్యవేక్షిస్తోంది. లారీ యజమానులు ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి డీడీలు చెల్లించి ఇక్కడికి వస్తారు. వాస్తవానికి లోడింగ్ చార్జీలను ప్రభుత్వమే కాంట్రాక్టర్లకు చెల్లిస్తుంది. కానీ, ఇక్కడ సీన్ రివర్స్ అవుతోంది. ఒక్కో లారీ నుంచి లోడింగ్ పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారు.

## - అక్రమ వసూళ్ల చిట్టా

★ లోడింగ్ ఛార్జీలు: రూ. 1,500
★ లేబర్ ఛార్జీలు: రూ. 1,200
★ జేసీబీ ఛార్జీ (కాంటా వద్ద): రూ. 300
★ కాంటా & సీరియల్ చార్జీలు: రూ. 300
★ ఇతర ఖర్చులు: వందల్లో..

మొత్తంగా ఒక్కో లారీ క్వారీ నుంచి బయటకు రావాలంటే ప్రభుత్వానికి కట్టే డీడీ కాకుండా, అదనంగా రూ. 3,000 నుండి రూ. 3,500 వరకు అక్రమంగా చెల్లించాల్సి వస్తోంది. రోజుకు వందలాది లారీలు లోడింగ్ అవుతున్న తరుణంలో, ఈ వసూళ్లు నిత్యం లక్షల రూపాయల్లో సాగుతున్నట్లు సమాచారం.

## - అధికారుల 'చూసీ చూడనట్లు'..

క్వారీల్లో ఇలాంటి వసూళ్లు జరగడం లేదని టీఎస్ఎండీసీ అధికారులు పైకి చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. కాంట్రాక్టర్ల అక్రమ వసూళ్లపై లారీ యజమానులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. ప్రశ్నిస్తే లోడింగ్ ఆలస్యం చేస్తామని లేదా సీరియల్ మార్చేస్తామని నిర్వాహకులు బెదిరింపులకు దిగుతున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## - ఉన్నతాధికారులు స్పందించాలి

నిబంధనలు ఉల్లంఘించి, లారీ యజమానులను వేధిస్తున్న క్వారీ కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు క్వారీల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ఈ నిలువు దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



# పరకాల గడ్డపై గులాబీ జెండా ఎగరేయాలి

## బీఆర్ఎస్ కార్నర్ సమావేశంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, చల్లా ధర్మారెడ్డి పిలుపు





అక్షరదర్బార్, పరకాల: మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ మోసపూరిత హామీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, నేత కేతిరెడ్డి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కొత్త బొడ్రాయి సెంటర్‌లో జరిగిన సమావేశంలో చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. గృహలక్ష్మి లబ్ధిదారులకు ఇండ్లు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలోనే పరకాల అభివృద్ధి చెందిందని తెలిపారు. ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు విస్తృతంగా అమలయ్యాయని, కాంగ్రెస్ మోసపు హామీలను ప్రజలు తిరస్కరించాలని కోరారు. కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి కాంగ్రెస్ హామీల అమలుపై నిలదీయాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో పలు వార్డుల బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులు దుబాసి వెంకటస్వామి, బొచ్చు శ్యామల బాబురావు, పంచగిరి సృజన సుమంత్,గంట కళావతి వెంకటేశ్వర్లు, దగ్గు సునీత, పడిదెల దీప్తి రాకేష్,కందుకూరి వేణుగోపాల మూర్తి ,బండి సారంగపాణి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# వర్కింగ్ జర్నలిస్టుల హక్కుల సాధన కమిటీ ఎన్నిక

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండల కేంద్రంలో వర్కింగ్ జర్నలిస్టుల హక్కుల సాధన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చల్ల రాజిరెడ్డి,గౌరవ సలహాదారులుగా కాలేశ్వరం నరసయ్య, అధ్యక్షులుగా కోడిమల రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా చెన్నబోయిన బుచ్చిబాబు, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ అబ్దుల్లా, బాసాని బాలకృష్ణ, కార్యదర్శిగా తుడుం రాజు, సంయుక్త కార్యదర్శులుగా మోటంరవి, ఉప్పునర్సయ్య, ప్రచార కార్యదర్శిగా బంక ప్రవీణ్, కోశాధికారిగా జక్కుల కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా బలిజ వేణు, జక్కుల శ్రీనివాస్, జక్కుల సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో గౌరవ అధ్యక్షులు చల్లారాజిరెడ్డి, అధ్యక్షుడు కొడిమాల రాజేందర్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కాగా, నూతన కమిటీని శాయంపేట సర్పంచ్ ఉమారవిపాల్, మైలారం సర్పంచ్ నూనె దివ్యతిరుపతి, పత్తిపాక ఉప సర్పంచ్ తుడుం రాజు సత్కరించారు.

# బీజేపీకి మరో భారీ షాక్..

## బీఆర్ఎస్ లో చేరిన బీజేపీ 14 వార్డు అభ్యర్థి

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ 14వ వార్డు బీజేపీ అభ్యర్థి బొల్లెద్ల సుష్మ కృపేందర్ బీజేపీ పార్టీకి రాజీనామా చేసి పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సమక్షంలో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) లో చేరారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నేతలు వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో పరకాల పట్టణ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందించిన పారదర్శక పాలనకు ఆకర్షితులై బిఅఆర్ఎస్‌లో చేరుతున్నట్లు సుష్మ కృపాకర్ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ, పరకాలలో బీఆర్ఎస్ బలం రోజురోజుకు పెరుగుతుందని, ఇతర పార్టీల నాయకులు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.





# వన దేవతల సన్నిధిలో భక్త జనసందోహం

## తిరుగువారం రోజున కొనసాగిన భక్తుల రద్దీ

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర బుధవారం తిరుగువారం సందర్భంగా వన దేవతల సన్నిధిలో భక్త జనసందోహం తో కోలాహలంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొదట గా జంపన్న వాగు లో పుణ్య స్నానాలు ఆచరించి వన దేవతలకు బంగారం,ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ కొనసాగుతున్నా తరుణం లో అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర పరిసర ప్రాంతాలలోని వ్యర్థాలను పారిశుధ్య కార్మికుల ద్వారా తొలగిస్తూ వ్యాధులు ప్రబలకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తిరుగువారం సందర్భంగా వన దేవతల పూజారులు కన్నేపల్లి ఆలయం లో శుద్ధి కార్యక్రమం నిర్వహించి వన దేవతలకు దీప దూప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# పాఠశాలలో వాటర్ బాటిళ్లు పంపిణీ

అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం రోజున 65 మంది విద్యార్థులకు వాటర్ బాటిల్ లను పంపిణీ చేశారు. వచ్చే వేసవికాలం దృష్టిలో పెట్టుకొని పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న కంచ రాజు కుమార్ కు బాబు పుట్టిన సందర్భంగా వాటర్ బాటిళ్ళను విద్యార్థిని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుల మరియు ఉపాధ్యాయుల చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లకావత్ దేవ పుల్లూరి రామకృష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పతనం ఆరంభం

- బీజేపీ అభ్యర్థిని కొనుగోలు చేయడం సిగ్గుచేటు
- డా. కాళీ ప్రసాద్ రావు




అక్షరదర్బార్, పరకాల: బీఆర్ఎస్ పార్టీ పతనం మొదలైందని పరకాల బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ కాళీ ప్రసాద్ రావు విమర్శించారు. బుధవారం పరకాల పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్నారని ఆరోపించారు.ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ డాక్టర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు. డాక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు సంపాదించిన డబ్బులతో ఇతర పార్టీల అభ్యర్థులను కొనుగోలు చేయడం సిగ్గుచేటని అన్నారు. బీజేపీ అభ్యర్థులు అభివృద్ధి కోసమే రాజకీయాల్లోకి వస్తారని స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి బీజేపీ అభ్యర్థిని బెదిరించి కొనుగోలు చేయడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్యంపై దాడి అని పేర్కొన్నారు. డాక్టర్ కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయాలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని, ప్రజాస్వామ్యం గెలవాలంటే బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు.

# ట్రాలీ ఆటో బోల్తా..

- అతివేగంగా వచ్చి మూలమలుపు వద్ద ఫల్టీ
- 10 మందికి తీవ్ర గాయాలు
- ఘటనా సమయంలో ఆటోలో 30 మంది భక్తులు
- చర్ల నుంచి మేడారం వెళ్తుండగా తాడ్వాయి సమీపంలో ప్రమాదం
- వెంటనే స్పందించిన ఎస్సై జగదీష్.. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలింపు



అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: చర్ల నుంచి మేడారం వైపు భక్తులతో వెళ్తున్న ట్రాలీ ఆటో తాడ్వాయి మండలం పరిధిలో అతివేగం కారణంగా బోల్తా పడింది కామారం గ్రామాన్ని దాటి గిన్నెలవాగు బ్రిడ్జి సమీపంలోని మలుపు వద్ద వాహనం అతి వేగంగా వెళ్లడం వల్ల డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో అదుపు తప్పి ఫల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న సుమారు 30 మంది ప్రయాణికుల్లో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే తాడ్వాయి ఎస్.ఐ. జగదీశ్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని అంబులెన్స్ లో సమీప దవాఖానకు తరలించి తక్షణ చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. రోడ్డుపై మూల మలుపులు, బ్రిడ్జిల వద్ద వాహనాలను అతి వేగంగా నడపకుండా జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ సూచించారు.



## నాలుగో డివిజన్‌లో బీజేపీ జోరు

### పుల్ల స్వరూప గెలుపే లక్ష్యంగా శ్రేణుల ప్రచారం

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ ఎన్నికల్లో నాలుగో డివిజన్ కౌన్సిలర్‌గా పోటీ చేస్తున్న భారతీయ జనతా పార్టీ అభ్యర్థి పుల్ల స్వరూపకు మద్దతుగా ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. నాలుగో డివిజన్ ఇంచార్జి, జిల్లా కోశాధికారి ఎర్ర రామన్నతో పాటు ఆ డివిజన్‌కు చెందిన బూత్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందని పేర్కొంటూ, అభివృద్ధి కొనసాగాలంటే భారతీయ జనతా పార్టీ అభ్యర్థి పుల్ల స్వరూపను గెలిపించాలని ఓటర్లను కోరారు.ఈ ప్రచారంలో పుల్ల రాజు, సాంబయ్య, ఈశ్వర్, అభిరామ్, లత, దీప, సుజాతతో పాటు వార్డు ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.



## 7వ వార్డులో బీఆర్ఎస్ విస్తృత ప్రచారం

### నాగరాజుకు మద్దతిస్తున్న వార్డు ప్రజలు

అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా 7వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి దంపేటి నాగరాజు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆశీస్సులతో సాగిన ఈ ప్రచారంలో, పరకాల అభివృద్ధి ధర్మారెడ్డి హయాంలోనే సాధ్యమైందని నాయకులు తెలిపారు. మళ్లీ పరకాల అభివృద్ధి కొనసాగాలంటే బిఆర్ఎస్ పార్టీ గెలవాల్సిన అవసరం ఉందని ఓటర్లను కోరారు. ఈ ప్రచారంలో ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని, వార్డు ప్రజలు బిఆర్ఎస్‌కే తమ మద్దతు ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకుడు నల్లెల లింగమూర్తి, గూడెం కృష్ణమూర్తి, సుధాకర్, సుమన్, అడప సుధాకర్, గోపు భాస్కర్ , అడప గణేష్, గుడి కందుల శివ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపటి నుంచి మేడారం హుండీల లెక్కింపు

### - హనుమకొండ టీటీడీ కళ్యాణ మండపంలో భారీ ఏర్పాట్లు

అక్షరదర్బార్, హనుమకొండ: ఆసియాలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతర ముగియడంతో, భక్తులు అమ్మవార్లకు సమర్పించుకున్న కానుకల లెక్కింపునకు ముహూర్తం ఖరారైంది. గురువారం ఉదయం నుంచి హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కళ్యాణ మండపంలో హుండీల లెక్కింపు ప్రక్రియ అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య ప్రారంభం కానుంది. జాతర సమయంలో గద్దెల ప్రాంగణం, క్యూలైన్లు, ఆలయ పరిసరాల్లో మొత్తం 827 హుండీలను ఏర్పాటు చేశారు. భక్తులు సమర్పించిన కానుకలతో నిండిన ఈ హుండీలను ఇప్పటికే ఆర్టీసీ కార్గో వాహనాల్లో మేడారం నుంచి హనుమకొండకు తరలించారు. ఈ లెక్కింపులో వెల్లడయ్యే మొత్తం ఆదాయంపై అటు ప్రభుత్వం, ఇటు భక్తులలో ఆసక్తి నెలకొంది.


### - పారదర్శకంగా లెక్కింపు

దేవదాయ శాఖ అధికారులు, బ్యాంకు సిబ్బంది, వందలాది మంది స్వచ్ఛంద సేవకుల సమక్షంలో ఈ లెక్కింపు జరగనుంది. హుండీల్లో లభించే నగదును వెనువెంటనే లెక్కించి అక్కడే ఏర్పాటు చేసిన బ్యాంకు కౌంటర్లలో డిపాజిట్ చేస్తారు. నగదుతో పాటు భక్తులు సమర్పించిన బంగారం, వెండి ఆభరణాలు, విదేశీ కరెన్సీని విడివిడిగా నమోదు చేస్తారు. నిబంధనల ప్రకారం లెక్కింపు పూర్తయ్యాక వచ్చిన మొత్తం ఆదాయంలో ప్రభుత్వం నిర్ణయించిన వాటాను పూజారులకు అందజేయనున్నారు. లెక్కింపు కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.



# కడియం అనర్హత పిటిషన్ పై విచారణ

- ఈ నెల 19కి వాయిదా వేసిన స్పీకర్
- స్పీకర్ కు సాక్ష్యాధారాలు సమర్పించిన ఎమ్మెల్యే వివేకానంద గౌడ్



అక్షరదర్బార్, హైదరాబాద్: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనర్హత వేటు వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం స్పీకర్ చాంబర్‌లో విచారణ జరిగింది. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆయనపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారించారు. విచారణలో భాగంగా పిటిషనర్ వివేకానంద గౌడ్, కడియం శ్రీహరి పార్టీ మారిన తీరుకు సంబంధించిన కీలక సాక్ష్యాధారాలను, పత్రికా ప్రకటనలను, వీడియో క్లిప్పింగులను స్పీకర్‌కు సమర్పించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం, ఈ కేసు తదుపరి విచారణను స్పీకర్ ఈ నెల 19వ తేదీకి వాయిదా వేశారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో స్పీకర్ వరుసగా విచారణలు చేపడుతుండటంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.





## బీజేపీలో భారీగా చేరికలు

అక్షరదర్బార్, పరకాల: దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరిపాలనకు ఆకర్షితులై పరకాల పట్టణంలోని 9వ వార్డుకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి వారిని పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పరకాల మున్సిపాలిటీ 9వ వార్డులో బీజేపీ అభ్యర్థి బెజ్జంకి పూర్ణచారి గెలుపే లక్ష్యంగా పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. పార్టీ అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్న తీరుపై విశ్వాసంతో బీజేపీలో చేరినట్లు పేర్కొన్నారు. బీజేపీలో చేరిన వారిలో దాసరి రవి, బచ్చాలి శ్రీనివాసరావు, క్యాతం రమేష్, ఈగ సారంగపాణి, శంకర్, సురేష్, ఆదిత్య, క్రాంతి, అభినయ్, అరుణ్, శేఖర్ తదితరులు ఉన్నారు. ఈ చేరికలతో 9వ వార్డులో బీజేపీ బలం మరింత పెరిగిందని పార్టీ నాయకులు తెలిపారు.

## 7వ వార్డులో దూసుకుపోతున్న కాంగ్రెస్

### సునీల్ కు సంపూర్ణ మద్దతు ప్రకటించిన సీతారాంపురం

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని 7వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పావుశెట్టి సునీల్ బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. సీతారాంపురం గ్రామంలో ఇంటింటి ప్రచారం చేపట్టిన ఆయన, కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.సునీల్ ప్రచారంలో



కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పాటు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని ఉత్సాహంగా కొనసాగించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ, ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని పేర్కొన్నారు.



## 18వ వార్డులో బీఆర్ఎస్ కు పెరుగుతున్న మద్దతు

అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో బీఆర్ఎస్‌కు ప్రజల మద్దతు వెల్లువెత్తుతోంది. బుధవారం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రేగూరి కరుణ విజయపాల్‌రెడ్డి వార్డులో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆశీస్సులతో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ప్రతి ఇంటికి వెళ్లి ఓటును అభ్యర్థించారు. కార్యకర్తలతో కలిసి ఈ సందర్భంగా వార్డు ప్రజలు అభ్యర్థి కరుణను ఆప్యాయంగా స్వాగతిస్తూ తమ ఓటు బీఆర్ఎస్‌కే అని హామీ ఇచ్చినట్లు తెలిపారు.బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను గుర్తుచేస్తూ, మున్సిపాలిటీ ఎన్నికల్లో కరుణ విజయపాల్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిస్తామని స్థానికులు వెల్లడించారు.

## ప్రచారంలో శాయంపేట బీఆర్ఎస్ నాయకులు

అక్షర దర్బార్ శాయంపేట : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 1వ, 4వ, 20వ, 21వ, 24వ వార్డుల్లో శాయంపేట మండల బీఆర్ఎస్ నాయకులు, భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ, కాంగ్రెస్ మోసాలను ఎండగడుతూ ఇంటింటికీ తిరిగి ఓటును అభ్యర్థించారు. భూపాలపల్లి ప్రజలందరూ కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శాయంపేట మండల అధ్యక్షులు గంగుల మనోహర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ దాసి శ్రావణ్ కుమార్, గ్రామశాఖ అధ్యక్షులు మేకల వెంకన్న, చెన్నబోయిన అజయ్ కుమార్, సవాసి రమేష్, ఇమ్మడిశెట్టి సదానందం, ఎండి మోహబుద్దీన్,మారేపల్లి నందం,త్రిపురాల శ్రీనివాసరావు,ఉదరి మహేష్, కొమ్మల శివ, గాదె రాజేందర్, అరికిళ్ల ప్రసాద్, పెంబర్తి వినయ్, శ్యాంసుందర్ రెడ్డి, ముష్క వినోద్, రామ్ శెట్టి లక్ష్మారెడ్డి, లావద్య రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## తహసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ తనిఖీ

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూభారతి,సాదాబైనామా, జాతీయ రహదారులు, మీ సేవా సర్టిఫికెట్స్, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, రికార్డులను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. అదేవిధంగా మండలానికి సంబంధించి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్–ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియ ఎంతవరకు పూర్తయిందని తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ ను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సర్టిఫికెట్స్ త్వరితగతిన జారీ చేయాలని తహసీల్దార్ ను ఆదేశించారు. సర్టిఫికెట్స్ జారీ విషయంలో జాప్యం చేయొద్దని సూచించారు.

# ఆల్ టైం రికార్డ్



- వండర్ హాట్ మిర్చి ధర క్వింటాల్ రూ. 37,100
- వరంగల్ ఎనుమాముల మార్కెట్ లో సరికొత్త రికార్డు ధర..
- 'దేశీ' రకానికి ఏకంగా రూ. 41 వేలు

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ చరిత్రలో మిర్చి ధర సరికొత్త రికార్డును సృష్టించింది. బుధవారం మార్కెట్‌కు వచ్చిన 'వండర్ హాట్' రకం మిర్చి క్వింటాల్‌కు అత్యధికంగా రూ. 37,100 ధర పలికి వ్యాపారులను, రైతులను ఆశ్చర్యానికి గురిచేసింది. గత నెల రోజులుగా పెరుగుతూ వస్తున్న మిర్చి ధరలు, నేడు ఆల్ టైమ్ హైకి చేరుకోవడం విశేషం. మార్కెట్‌కు వస్తున్న వివిధ రకాల మిర్చిలకు లభిస్తున్న ధరలు ఇలా ఉన్నాయి. వండర్ హాట్ క్వింటాల్‌కు రూ. 30,000 నుండి రూ. 37,100 వరకు పలుకుతోంది. దేశీ రకం మరింత ఘాటెక్కి క్వింటాల్‌కు రూ. 35,000 నుండి రూ. 41,000 వరకు రికార్డు ధర లభిస్తోంది. తేజ మిర్చి క్వింటాల్‌కు రూ. 19,000 నుండి రూ. 20,000 వరకు స్థిరంగా కొనసాగుతోంది.

## - సాగు తగ్గడమే కారణమా?

ఈ ఏడాది మిర్చి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గడమే ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపార వర్గాలు విశ్లేషిస్తున్నాయి. డిమాండ్‌కు తగ్గట్టుగా దిగుబడి లేకపోవడంతో ధరలు భారీగా పెరుగుతున్నాయని మార్కెట్ కమిటీ కార్యదర్శి మల్లేశం తెలిపారు. గడిచిన కొద్ది రోజులుగా మార్కెట్‌లో ఇదే ట్రెండ్ కొనసాగుతోందని, నాణ్యమైన పంటకు మరింత ధర వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.



# ఏసీబీ వలలో 'పెద్ద' చేప

- రూ. 15 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిపోయిన ఎస్ఈ
- బిల్లుల క్లియరెన్స్ కోసం కాంట్రాక్టర్ ను వేధించిన వైనం..
- జీహెచ్ఎంసీ కూకట్ పల్లి జోనల్ ఆఫీసులో ఏసీబీ మెరుపు దాడులు

అక్షరదర్బార్, హైదరాబాద్: ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి తిమింగలాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) మరోసారి పంజా విసిరింది. కూకట్‌పల్లి జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ)గా పనిచేస్తున్న చిన్నారెడ్డి, రూ. 15 లక్షల భారీ మొత్తాన్ని లంచంగా తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటం నగరంలో కలకలం రేపింది.

## - వివరాల్లోకి వెళ్తే..

ఒక కాంట్రాక్టర్‌కు సంబంధించిన పాత పెండింగ్ బిల్లులను క్లియర్ చేయడానికి ఎస్ఈ చిన్నారెడ్డి భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేశారు. దీనిపై సదరు కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు, బుధవారం కూకట్‌పల్లి కార్యాలయంలో కాంట్రాక్టర్ నుంచి రూ. 15 లక్షలు తీసుకుంటుండగా చిన్నారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.

## కొనసాగుతున్న సోదాలు

అధికారి కార్యాలయంతో పాటు ఆయన నివాసంలోనూ ఏసీబీ బృందాలు ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కోణంలోనూ విచారణ జరుపుతున్నారు. పట్టుబడిన నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. "అవినీతికి పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదు. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలి" అని ఏసీబీ అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# సీఎం పర్యటనకు 'కోటంచ' ముస్తాబు

- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్
- 8న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనానికి రానున్న రేవంత్

అక్షరదర్బార్, రేగొండ: రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 8న రేగొండ మండలం కోటంచలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని సందర్శించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సంకీర్త్ కలిసి పర్యటన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా కలెక్టర్, ఎస్పీలు ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో 'పడివట్టం' కట్టి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ పరిసరాల్లో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదు. ప్రతి సెక్టార్‌కు ఒక ప్రత్యేక అధికారిని నియమించి పర్యవేక్షణ చేపడుతాం. ఆలయాన్ని సుందరంగా అలంకరించడంతో పాటు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలి. అదనపు సిబ్బందిని కేటాయించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు.

## - ట్రాఫిక్, భద్రతపై ఎస్పీ దిశానిర్దేశం

జిల్లా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ.. సీఎం పర్యటన దృష్ట్యా భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా నాలుగు ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తున్నామని, ప్రజల సౌకర్యార్థం సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం సీఎం దిగాల్సిన హెలిప్యాడ్ స్థలాన్ని అధికారులు పరిశీలించి, భద్రతా ప్రమాణాల మేరకు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ, వివిధ శాఖల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రమేష్, శ్వేత, వెంకటేశ్వర్లు, ఆలయ ఈఓ మహేష్ పాల్గొన్నారు.



# డీసీపీకి 'ఉత్కృష్ట సేవా పతకం'

- అందజేసిన సీపీ సన్ ప్రీత్ సింగ్
- విధి నిర్వహణలో ప్రతిభకు దక్కిన కేంద్ర ప్రభుత్వ గుర్తింపు



అక్షరదర్బార్, హనుమకొండ: పోలీస్ విభాగంలో అంకితభావంతో ఉత్తమ సేవలు అందించినందుకు గాను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్ఠాత్మక 'ఉత్కృష్ట పతకాన్ని' వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ అందుకున్నారు. బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ క్యాంపు కార్యాలయంలో సీపీ సన్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా ఆయన ఈ పతకాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అసాధారణ ప్రతిభ కనబరిచే అధికారులకు శాఖాపరమైన గుర్తింపుతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పురస్కారాలు లభిస్తాయని కొనియాడారు. రాజమహేంద్ర నాయక్ తన సుదీర్ఘ సర్వీసులో అనేక కీలక కేసులను ఛేదించడమే కాకుండా, శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. రాజమహేంద్ర నాయక్ 2010లో డీఎస్పీగా పోలీస్ శాఖలో ప్రవేశం చేశారు. నెల్లూరు, వరంగల్ సీసీఎస్, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో డీఎస్పీగా సేవలు అందించారు. కార్యక్రమంలో వెస్ట్ జోన్ పరిధిలోని ఏసీపీలు, సీఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొని డీసీపీకి ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎన్నికల పర్యవేక్షణకు మీడియా సెంటర్

- ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద




అక్షరదర్బార్, వరంగల్: రాబోయే మున్సిపల్ ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించే దిశగా జిల్లా యంత్రాంగం మరో కీలక అడుగు వేసింది. వరంగల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని డీపీఆర్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ) ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సెంటర్‌లోని సౌకర్యాలను పరిశీలించిన కలెక్టర్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన తాజా సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చేరవేయాలి. ఎంసీఎంసీ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను క్షుణ్ణంగా పర్యవేక్షించాలి. అభ్యర్థుల ప్రచార ప్రకటనలకు నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలి. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పోస్టులను నిరంతరం గమనిస్తూ ఉండాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## - మీడియా సహకారం అవసరం

ఎన్నికల ప్రక్రియలో మీడియా పాత్ర అత్యంత కీలకమని, ఓటర్లను చైతన్యపరచడంతో పాటు పారదర్శక ఎన్నికల నిర్వహణకు మీడియా ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి , జడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీపీఆర్వో అయుబ్ అలీ, ఆర్డీఓ సుమా, డీపీఓ కల్పన, డీపీసీడీఓ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల తర్వాత 'రైతు భరోసా'

## - మిర్యాలగూడ సభలో సీఎం కీలక ప్రకటన



అక్షరదర్బార్, మిర్యాలగూడ : మున్సిపల్ ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సుడిగాలి పర్యటనలకు శ్రీకారం చుట్టారు. బుధవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ వేదికగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ఆయన, విపక్షాలపై విమర్శనాస్త్రాలు సంధిస్తూనే ఓటర్లకు వరాల జల్లు కురిపించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదిస్తే, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని హామీ ఇచ్చారు. మిర్యాలగూడ మండలం గూడూరులో జరిగిన 'ప్రజాపాలన ప్రగతిబాట' బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ రైతుల కోసం కీలక ప్రకటన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎదురుచూస్తున్న 'రైతు భరోసా' నిధులను మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, ఇప్పటికే రుణమాఫీతో రైతులను ఆదుకున్నామని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిని ఎండగట్టిన సీఎం, పదేళ్ల విధ్వంసాన్ని తాము సరిదిద్దుతున్నామని చెప్పారు. "మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడం ద్వారా అభివృద్ధికి మద్దతు తెలపండి. మీ ఓటుతో ప్రజా వ్యతిరేక శక్తులకు తగిన గుణపాఠం చెప్పాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు, భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.




# మీ గొంతుక! మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజు మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915